# అద్దాల గది

**"నా** స్వరూపం ఏమిటో తెలుసుకోవాలని చాలా కాలంగా ఉంది. స్వస్వరూప జ్ఞానం ప్రతివాడికి ఉండాలని పెద్దలు చెబుతారు" అన్నాను.

నా మార్గదర్శి నా వంక విచిత్రంగా చూసి "అట్లా అయితే ఒకసారి అద్దాల గదికి పోయి వద్దాం!" అన్నాడు.

"అక్కడికి పోతే నాకు స్వస్వరూపజ్ఞానం కలుగుతుందా?" అన్నాను.

"అది నువే నిర్ణయించుకుందువుగాని" అన్నాడు నా మార్గదర్శి.

"సరే పద!" అన్నాను.

❀ ❀ ❀ ❀ ❀

"ఇక్కడ అన్నిరకాల అద్దాలు ఉన్నై! నిన్ను గురించి ఇవి ఏమి అభిప్రాయం ఇస్తయ్యో అడిగి తెలుసుకో" అన్నాడు నా మార్గదర్శి.

నేను మొదటి అద్దాని సమీపించబోతుండగా నా మార్గదర్శి నన్ను వెనక్కు పిలిచి "నీ నిజస్వరూపం గురించి తెలుసుకోవాలంటే నీ నగ్న స్వరూపాన్ని అద్దాలకు చూపించవలసి ఉంటుంది. నీ దుస్తులను గురించి ఈ అద్దాలిచ్చే అభిప్రాయం నీకెందుకు గనక" అన్నాడు.

ఒకసారి అద్దాల గది యావత్తు కలయజూశాను. స్వస్వరూప జ్ఞానం కోసం వచ్చిన నా బోటి దౌర్భాగ్యులు నలుగురైదుగురు గదిలో కనిపించారు. నలుగురినీ పరీక్షగా చూశాను.

ఎవరి మొహానా సంతోష చిన్నెలు లేవు. అందరి మొహాలూ ముకుళించి ఉన్నై. అందులో ప్రత్యేకించి ఒక పెద్ద మనిషి ప్రతి అద్దం ముందు ఆగి తన దుస్తులు అద్దం ఆమోదించే విధంగా మార్చుకుంటూ మూతి ముక్కు విరుస్తూ, రకరకాల మొహాలు పెడుతున్నాడు.

"అన్ని అద్దాల దగ్గిరా సదభిప్రాయం పుచ్చుకోవాలని ఆ మనిషి అభిప్రాయం" అన్నాడు నా మార్గదర్శి.

ఇంకో ఆయన, తనను గురించి అద్దాలు తృప్తికరమైన అభిప్రాయం ఇవ్వనప్పుడల్లా వాటిని తన చేతి రుమాలుతో బలం కొద్దీ తుడుస్తున్నాడు.

"లోపమంతా అద్దంలోనే ఉందనీ, తనలో ఏమి లేదనే ఆ మనిషి భ్రమ" అన్నాడు నా మార్గదర్శి.

మరో పెద్దమనిషి ప్రతి అద్దంలోనూ మొహంపెట్టి చూసుకొంటున్నాడు.

"అద్దాలకంత దగ్గిరగా నిలబడితే అద్దం అభిప్రాయం తనకు తెలీదని ఆ మనిషి ఎరగడు" అన్నాడు నా మార్గదర్శి.

నేను చూస్తూండగానే ఇంకో మనిషి అతి వేగ అద్దాల గదిలో ప్రవేశించి నేరుగా ఒకటి రెండద్దాల దగ్గిరికి పోయి తన స్వరూప జ్ఞానం పొంది తిరిగి గబగబా బయటికివెళ్లిపోయినాడు.

"ఆ మనిషి వివేకితనను తాము గురించి తనకు సందేహం కలిగినప్పుడల్లా తనకు విశ్వాసం ఉన్న ఒకటి రెండు అద్దాల దగ్గిర అభిప్రాయం పుచ్చుకుని వెళ్లిపోతాడు. దారిలో అతను దాటిపొయ్యే అద్దాలు తమ అభిప్రాయం చెప్పకపోవు. కాని ఆ మనిషి వినిపించుకోడు. తన దారిని తలవంచుకుని వెళ్లిపోతాడు.

"ఇక్కడికి వచ్చే వాళ్లలో తమ నగ్న స్వరూపం తెలుసుకునే వాళ్లెవరూ లేరా ఏమిటి?" అన్నాను.

"సాధారణంగా తమ నగ్నస్వరూపం చూసుకోవడం ఇష్టం ఉండదు. అది నేరమో ఆత్మవంచనో అనుకోకు. నీ నగ్న స్వరూపజ్ఞాం వల్ల నీకాటే ప్రయోజనం కూడా లేదు. కేవలం నీ వంటి జిజ్ఞాసువులు మాత్రమే ఆ పనికి పూనుకొంటారు" అన్నాడు నా మార్గదర్శి.

నన్ను నా మార్గదర్శి జిజ్ఞాసువన్నందుకు చాలా సంతోషంవేసి, బట్టలు విప్పేసి అద్దాలను సమీపించాను...

* * * * *

నేను తిరిగి వచ్చిన తరవాత, "ఏం తెలుసుకున్నావు?" అని నా మార్గదర్శి అడిగాడు.

"కొన్ని అద్దాలు చాలా వంకల టింకర అద్దాలు. మొత్తానికి ఒక అద్దం కూడా నిర్దుష్టంగా లేదు. కొన్నిటి అభిప్రాయాల ప్రకారం నా ఒల్లుతో పోలిస్తే చాలా చిన్నదీ, కొన్నిటి అభిప్రాయం ప్రకారం పెద్దదీను. కొన్ని అద్దాలు నాకు గూని ఉన్నదన్నై. మరికొన్ని నాకు మెల్లకున్ను అంటగట్టినై. కొన్ని సన్నని వాడన్నై, మరికొన్ని లావుపాటి వాడన్నై. కొన్ని అద్దాలు నన్ను పదింతలు చేసినై, మరికొన్ని, ఎంత దగ్గరగా నిలబడినా, చాలా చిన్నచూపు చూసి నాకు కొద్దిచోట మాత్రమే ఇచ్చినై. కొన్ని అద్దాలు నా శరీరచ్ఛాయ నల్లగా ఉన్నట్లు అభిప్రాయమిచ్చినై, మరికొన్ని నేను చాలా పల్చని వాణ్నని ఒప్పుకున్నై.

"కొన్ని అద్దాలకు బొత్తిగా కళాయి లేదు. మరికొన్ని చాలా చిన్నవి, నన్ను గురించి

ఏకంగా ఒకేసారి అభిప్రాయం ఇవ్వలేక, ఒకసారి నాముక్కును గురించీ, మరోసారి మూతిని గురించీ ఇట్లా విరిచి విరిచి అభిప్రాయం ఇచ్చిన్నై. కొన్ని అద్దాలలో మీకిలా జీర్ణించిపోయింది. అది బ్రావకాలు పోసి కడిగినా పొయ్యేటట్టులేదు. మకిలి మాట అట్లా ఉంచి అప్పుడప్పుడూ ఈ అద్దాల మీది దుమ్ముతుడిచే వాళ్లయినా లేకపోవడం శోచనీయం.

"మొత్తం మీద అద్దాలన్నిటినీ అడిగి వచ్చాను. కానివారు స్వస్వరూప జ్ఞానం కలిగినట్టు లేదు. పైపెచ్చు నాకు స్వస్వరూప జ్ఞానం పొందాలనే కాంక్ష కాస్తా పోయి ఊరు నుండి ఇన్ని దిక్కుమాలిన అద్దాలకంటే శాస్త్రీయంగా నిర్దుష్టమైన ఒక్క అద్దం ఉంటే మనుషులకు యధార్థమైన స్వరూప జ్ఞానం కలుగుతుంది గదా!" అన్నాను.

నా మార్గదర్శి నవ్వి "శాస్త్రీయంగా నిర్దుష్టమైన అద్దం ఉందనే విషయమూ, యధార్థమైన స్వరూప జ్ఞానమంటూ ఉందనే విషయం, చాలా అనుమానాస్పదమైనవి. వాటిని గురించి ఆటే తాపత్రయపడకు. నీలో ఉండే మిట్ట పల్లాలను అద్దం మిట్టపల్లాలుగా ప్రదర్శించదు. వెలుతురు నీడలుగా ప్రకటిస్తుంది. అక్కడికదే ఒక అబద్ధం... ఈ అద్దాలలో ముప్పాతిక మూడు వీసాలు ఎందుకు పనికిరానివైనా మిగతావి ప్రకటించే అభిప్రాయాలన్నీ నాకు ఏదో విధంగా పనికి వచ్చేవేననేవి జ్ఞాపకం ఉంచుకో. నిన్ను ఇంతలుగా ప్రకటించే అద్దంలో నీ మొహం మీది మచ్చలు కూడా పదింతలు కనిపిస్తే – నీకు చూడాలనే కోరికే ఉంటే నిన్ను చిన్నవాణ్ని చేసి చూపించే అద్దాలవల్ల ప్రపంచంలో నువేకాక ఇంకా ఇతర విషయాలకు చోటున్నదని నీకు తెలుస్తుంది. నీకు లేని వంకరలు ఆపాదించే అద్దాలనుబట్టి కూడా నువు నేర్చుకోదగినది చాలా ఉంటుంది. అది తెలుసుకునే చాకచక్యం నీలో ఉంది. అసలు రహస్యమేమంటే నీ స్వరూపం గురించి అభిప్రాయాలు ఇవ్వటమే ఈ అద్దాల వంతుగాని నీ మిట్ట పల్లాలను తెలుసుకోవాలంటే నిన్ను నువ్వు తడిమి చూసుకోవటం కంటె ఉత్తమమైన పనిలేదు" అన్నాడు.

***రచన : 1943 ?***

***ముద్రణ : కుటుంబరావు సాహిత్యం ఆరవ సంపుటం,***
***విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, డిసెంబర్ 1994***